

నాన్నపోయి ఆరేళ్ళయింది—

అమ్మపోయి నాలుగేళ్ళయింది—

అన్నయ్య పోయి ఏడాదయింది—

రమ నిన్న వెళ్ళిపోయింది — భర్తతో.

తానీనాడు ఒంటరిది.

నాన్న పోయిననాడు, అమ్మా, అన్నయ్యా తనను ఓదార్చారు. అమ్మ పోయిననాడు అన్నయ్య వున్నాడు తనకూ రమకూ ధైర్యం చెప్పటానికి. అన్నయ్య పోయిననాడు రమ తనకు తోడుంది. ఇద్దరూ ఒకరినొకరు ఊరడించుకుంటూ రోజులు నెట్టుకొచ్చారు. వయస్సులో భేదం ఉన్నా, అక్కాచెల్లెళ్ళుగాకంటే ఆప్తమిత్రులుగా మసిలారు తనూ, రమా. చిన్నదైనా రమ తనకంటే ఎన్నో విషయాల్లో మెరుగు.

అలాంటి రమ కూడా వెళ్ళిపోయింది. అవును మరి! ఆడపిల్ల కన్నవారింట్లో ఎన్నాళ్ళుంటుంది? పెళ్ళయిన తొమ్మిది నెలల వరకూ యిక్కడే వుండనిచ్చాడు మరిది. ఉద్యోగం దొరికింది. కాపురం ఏర్పాటు చేసుకున్నాడు. రమను తీసుకు పోయాడు.

తానీనాడు ఒంటరిది! కష్టం రానీ, సుఖం రానీ తనకు తను నిభాయించుకోవలసిందే. మనసులో మాటని చెప్పుకునే వ్యక్తి లేడు.

అరుణ హృదయం బరువెక్కింది. దీర్ఘంగా నిట్టూర్చి, జారిన పైటను సర్దుకుని మంచం మీద పైకి జరిగి కూర్చుంది. అప్రయత్నంగా ఆమె చూపులు అద్దం మీదకు మళ్ళినాయి. తన ప్రతిబింబం తనకే వెగటు పుట్టించింది అరుణకు. 'అమ్మా, నాన్న తనకా పేరెలా పెట్టారో కాని, తనది సార్థక నామధేయం! అరుణట! అరుణ!' కాకుంటే శరీరమంతా - ఆపాదమస్తకం - ఏమిటీ ఎర్రదనం?— అసలిది ఎర్రదనమేనా - లేక తెలుపా? రెండూ కాదు!— 'అలినీలకుంతల —' అన్నారుగదా! ఆ జుట్టు చూడు - రమేష్ అన్నట్లు ఆంగ్లో ఇండియన్స్ 'హెయిర్!'

భగవాన్! నా కేనాటి శాపం యిది?'— అరుణ చేతులలో ముఖం కప్పుకుని రోదించసాగింది. తన శరీరం సంగతి తలచుకునేసరికి అరుణ కళ్ళముందు ఆమె చిన్ననాటి సంఘటన లీలగా మెదిలింది. తన చిన్నతనంలో తమ వూళ్ళో ఎవడో కుర్రాడొకడు 'సరదా'కి గడ్డివామిని తగలబెడితే, యజమాని కోపంతో

వూగిపోతూ వాణ్ణి ఎత్తి ఆవామిలో విసిరేశాట్టు! పైగా కత్తిపుచ్చుకుని నుంచున్నాట్టు — ఎవరూ ఆతన్ని రక్షించేందుకు రాకుండా! ఆ కుర్రాణ్ణి బయటికి తీసి బ్రతికిస్తే, తనలా వుంటాడు కాబోలు! ఎవరైనా సరే తన వంక తదేకంగా, వింతగా చూస్తుంటే అరుణ కి సంఘటన వెంటనే స్ఫురిస్తూ ఉంటుంది.

"ఏనాడో చేసిన పాపఫలం!"— తన వేదాంతానికి తనకే నవ్వొచ్చింది. అవునుమరి! తను బియ్యే బియిడీ ప్యాసై టీచర్ గిరీ వెలగబెడ్తూ, ఎమ్మే డిగ్రీకోసం ప్రయత్నిస్తున్నదాయె!

"ఏమిటలా ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నావ్? అదీ సందె చీకట్లో!"

అరుణ ఈలోకంలో పడి తలెత్తి చూసింది. హాలు తలుపుల మీద రెండు చేతులూ ఆనించి గుమ్మం మధ్యగా నిలబడి ఉన్నాడు సారథి!

అరుణ తొట్రుపడుతూ లేచి లైటు వేసి "రండి, కూర్చోండి" అంటూ కుర్చీ చూపింది. తనూ కూర్చుంటూ.

సారథి కూర్చున్నాడు. అరుణ వంక వో క్షణం పరీక్షగా చూసి నవ్వుతూ అడిగాడు "ఏమిటలా ప్రాక్టికల్స్ చేసి అలసిపోయిన కాలేజి అమ్మాయిలా వున్నావ్?"

సారథి చనువుకు ఆశ్చర్యపోలేదు అరుణ. నిన్న సాయంత్రం ఆమెకో టీచర్ రమేష్ తనను పరిచయం చేసిన పావుగంటకే సారథి ఏకవచన ప్రయోగం ఆరంభించాడు. అతని చనువుకు కోపమొచ్చినా ఏమీ అనలేక పోయిందితను కానీ, సారథి తనేదో గొప్ప తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటూ మాట్లాడే మాటల్ని మాత్రం తేలిగ్గా తీసుకోలేక పోయింది.

అరుణ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ప్రశ్నించాడు సారథి. "అరుణాదేవిగారూ, ఏ లోకంలో వున్నారు?"

అరుణ అతనివైపు అదోలా చూసి "పెర్వర్టెడ్ జీనియస్" అంటే ఏమిటూ?" అని

సారథి ముఖం ముడుచుకోలేదు. గొలున నవ్వేసి అన్నాడు "నన్ను నువ్వేం అనుకుంటే ఏంగానీ, నీకు మాత్రం 'ఫిలాసఫీ' బాగా వంటపడ్తోంది— ఆ! అదిసరే! మీ దెళ్లలతో మీరు వెళ్ళలేదేం? సెలవులే గదా"

అరుణ విసుగ్గా అంది "పానకంలో పుడకలా నే నెందుకూ?"

ఆ మాటలకు సారథి నవ్వాడు. "అద్భుతం, బాగా చెప్పారు" అని విషయం మారుస్తూ 'పోనీ పానకంలో మిరియంలా నాతో' సినిమాకు రాకూడదూ?— హిచ్ కాక్ పిక్చర్ 'మార్నీ' ఆడుతోంది. చాలా బాగుంటుంది."

సంభాషణలో నేకాకుండా ప్రవ



ర్తనలోకూడా సారధి తనపై తీసుకుంటున్న చనువుకు అరుణ ఆశ్చర్యపోయింది. "సినిమాలకూ, షికార్లకూ తిరిగే అలవాటు నాకు లేదు" అని నిర్మొహమాటంగా చెప్దామనిపించింది కాని, సారధి చూపులోని ప్రాధేయత ఆమె నోటింటు ఆమాటల్ని అననియ్యలేదు. ఒక్కక్షణం ఆలోచించి 'సరే!' అంది.

సారధికళ్ళు ఆనందంతో మెరిశాయి. అరుణ వంక తదేకంగా చూస్తూ వుండిపోయాడు.

ఊహాజగత్తులో విహరిస్తున్న సారధి అలంకరించుకొని సినిమాకు బయలుదేరిన అరుణను గమనించనే లేదు.

చేతనున్న తాళాన్ని ఆడిస్తూ "పోదామా?" అంది అరుణ. తొట్రుబాటుతో లేచాడు సారధి.

—సినిమానుండి యింటికి తిరిగి వచ్చిన అరుణ మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలు బయలుదేరాయి. హాలులో సారధి ప్రవర్తనను తలచుకునే సరికి ఆమె కేవేవో మధుర భావాలు కలిగాయి. జీవితంలో ఇంతవరకూ ఏ పురుషుడూ, తనచే ఆకర్షింప బడటమలావుంచి, తనను నిలకడగా కొన్ని క్షణాలయినా చూసిన పాపాన పోలేదు.

అసలు, మగవాళ్ళు అనే ఏమిటి, ఆడవాళ్ళు మాత్రం? — లేనికో- లేడీ టీచర్స్ రాధారాణీ, మేరీ లే ఏనాడూ తనతో చనువుగా మాట్లాడి ఎరుగరు! అంతవరకెందుకూ? చివరకు గరల్స్ స్టూడెంట్స్‌కి కూడా తను క్లాసులో పాఠం చెబుతుంటే బాధాకరంగానే వుంటుంది.

దీనికంతకీ కారణం? — తన రూపం!

అలాంటిని యీనాడు — నిన్న పరిచయమైన సారథి తనకు దగ్గరవుతున్నాడు. అసలు సారథి ఎవరు? తనెవరు? తనకే ఏ నాటి పరిచయస్తుడోనని రమేష్ సారథిని తనకు పరిచయం చేశాడు. కాకుంటే, ఆతనూ తమ జాతి (టీచర్) వాడేనట!

సారథి ప్రవర్తన, మాటల ధోరణి వలన తన కతనంటే సదభిప్రాయం కలుగక పోయినా, అతని మాటల్ని కాదనలేక పోతోంది. లేకుంటే హాల్లో తన భుజం మీద చేయివేసి, తను అతని వైపు తీక్షణంగా చూచినా, తన తప్పును సరిదిద్దుకోని సారథిని తనెందుకు ఉపేక్షించింది? ఏమైనా తన హృదయం సారథి వైపు మొగ్గుతోంది. దీనికి కారణం మనుష్యుల్లో తిరుగుతున్నా ఒంటరిదయి పోయిన యిరవై మూడేళ్ళ తన దుర్భర జీవితమే మో? —

"నేను సారథిని ప్రేమిస్తున్నానా? —"

ఈ భావన కలిగిన అరుణ పెదవులపై చిరునవ్వు విరిసింది. ప్రక్కకు తిరిగి లైటార్పి దిండులో తల దూర్చింది.

* * *

ఆ రోజు పెందలకడనే నిద్రలేచి యింటిపనులు పూర్తి చేసుకుంది అరుణ. తలంటిపోసుకుని కురులను ఆరబెట్టుకుంటోంది. పరీక్ష పేపర్లు దిద్దటానికి కూర్చుంది.

ఎండాకాలపు వాతావరణం చీదరగా వుంది. ఉదయం ఎనిమిది గంటలే అయినా పదిగంటలయినట్టుంది.

'హాల్లో, మిస్ అరుణా! బ్యూటిఫుల్!' అంటూ హుషారుగా ప్రవేశించాడు సారథి. అరుణ లేచి "రండి" అంటూ అతన్ని ఆహ్వానిస్తూ కుర్చీ చూపింది.

"నిన్ను చూస్తుంటే "కరుణశ్రీ" పద్యం గుర్తుకొస్తోంది అరుణా!" సారథి నవ్వుతూ కూర్చున్నాడు.

ఈ మాటలకు అరుణ సిగ్గుపడింది. "సైన్సు మాస్టారికి తెలుగు సాహిత్యం కూడా తెలుసే!" అంటూ కూర్చుంది.

సారథి హఠాత్తుగా ఆ సంభాషణ త్రుంచేస్తూ అడిగాడు "అన్నట్లు నీవు దిద్దుతున్న పేపర్లు ఏక్లాసువి?"

అరుణ చెప్పింది.

సారథి 'ఓహో' అంటూ తన కుర్చీని ఆమె ప్రక్కకు జరుపుకుని

టీపాయ్‌మీది పేపర్లను వంగి చూడసాగాడు.

"ఏమిటంత ఆసక్తిగా చూస్తున్నారు?"

"అబ్బే! ఏం లేదు మీ 'వాల్యుయేషన్' ఎలా వుంటుందోనని..."

"మామూలే" అంటూ అరుణ పేపర్లను తన చేతిలోని అట్టమీద పెట్టేసి వెనక్కి జరిగి కూర్చుంది.

సారథి ఆమెవైపు పరీక్షగా చూశాడు. క్షణాల తర్వాత అన్నాడు "కాని అరుణా! నీ పని కెందుకూ ఆటంకం?"

"ఫర్వాలేదు లెండి! తర్వాత చూస్తాను."

"నీ 'మెథడ్ ఆఫ్ వాల్యుయేషన్' చూడాలనే గదా అడుగుతున్నది! ఏం? నేను కూడా చూడటం ఇష్టంలేదా?"

సారథి మాటలకు "అహహ!... అదేం కాదు!" అని, బెరగ్గా అతనివైపు చూస్తూ ప్యాడ్‌ను అందుకుంది అరుణ.

క్షణాలు నిముషాలై అరగంట గడిచింది. ఈ అరగంటసేపూ అరుణ దిద్దుతున్న ప్రతి పేపరుమీద, దాన్ని రాసిన విద్యార్థి మీద ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తూనే వున్నాడు సారథి.

అరుణ అప్పుడే దిద్ది పడేసిన పేపరు తీసుకొని నిశితంగా చూడసాగాడు సారథి. కొద్దిసేపు అలాగే చూసి వచ్చిన మార్కులన్నిటినీ కూడి, తనలో తను ఏదో గొణుక్కున్నాడు.

"ఏమిటంత పరీక్షగా చూస్తున్నారు?" అంది అరుణ

సారథి ఆ పేపరులో ఒకచోట వేలుపెట్టి అరుణకు చూపిస్తూ అన్నాడు "చూడు! ఈ ప్రశ్నకు యింతకంటే నువ్వాశించే మంచి సమాధానం ఏమిటి?"

"ఏం మార్కులు తక్కువ పడ్డాయంటారా?" తేలిగ్గా అడిగింది అరుణ.

"అవును. పేజీన్నరలో వున్న పాయింట్సన్నీ వివరిస్తూ వ్యాసం వ్రాస్తే పదిహేనుకి నువ్విచ్చే మార్కులు ఆయిదా? పైగా తప్పులు మాత్రం ఏమున్నాయనీ?" సన్నగా నవ్వుతూ అన్నాడు సారథి.

అరుణ కూడా నవ్వింది. ఆ పేపరు తీసుకుని చదువుతూ "అయితే ఎన్ని వెయ్యమంటారో కూడా చెప్పండి!"

"చూడండి" అంటూనే "నేనైతే కనీసం పది మార్కులన్నా వేస్తాను" అన్నాడు సారథి.

అరుణ లీలగా నవ్వుతూ తను వేసిన ఐదు అంకెకు మరో అయిదు చేర్చి, "చాలా?" అంటూ చిలిపిగా సారథి కళ్ళల్లోకి చూసింది.

"థాంక్యూ" అని "అదే చేత్తోనే ఆ పదో ప్రశ్న కూడా చూడు" అన్నాడు సారథి.

అరుణ పేజీలు తిరగేసి చదివిన

తర్వాత 'దీని కెన్ని వెయ్యాలంటారూ?' అని అడిగింది.

సారథి మాట్లాడలేదు అరుణే దాన్ని మరోసారి చదివి తను అంతకు ముందు వేసిన 'మూడు' అంకెను 'ఆరుగా' మార్చింది.

సారథి ఉత్సాహంగా చిటికేసి 'మాశావా మరి! అన్యాయంగా ఆ కుర్రాణ్ణి తప్పించేశావు! నే చూడకపోతే వాడి ఖర్మ అంతేగా?' అని అరుణవైపు చూసి నవ్వాడు.

అరుణ కూడా నవ్వుతూ 'పోనీ లెండి! మీరు పుణ్యం కట్టుకున్నారుగా?' అంది.

'పోస్ట్' అన్న కేకతో వాళ్ళ ప్రసంగానికి అంతరాయం ఏర్పడింది అరుణ తన చెల్లెలి వద్దనుండి వచ్చిన ఉత్తరాన్ని చదవటం అయిన తర్వాత సంభాషణ వేరే విషయాల మీదికి మళ్ళింది.

మరి కొంత సేపయిన తర్వాత అరుణ వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు సారథి,

* * *

సారథి ఆ వూరునుంచి వెళ్ళి వారంరోజులైంది. అతను వెళ్ళిపోయిన తర్వాత అరుణ మనస్సు మనసులో లేదు ఆమె హృదయంలో అతని రూపు నిలిచిపోయింది. అతన్ని గురించిన తలపులతో వేగిపోయిందామె మనస్సు

ఉదయం పది గంటలైంది. అన్యమనస్కంగా వరండాలో కూర్చుని ఏదో ఆలోచనలో మునిగి వున్న అరుణ 'పోస్ట్' అన్న కేకతో త్రుళ్ళిపడి లేచింది

కవరందుకుని చింపి చూసింది. ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి. పెదవులమీద చిరునవ్వు చిందులాడింది మనస్సు పరవశించింది. హృదయం వుద్రేకంతో ముందుకురికింది—అది సారథి వ్రాసిన ఉత్తరం.

అరుణ చదువుకో సాగింది.

'మిస్ అరుణాదేవీ!—'

ఈ ఉత్తరాన్ని పూర్తిగా చదివి నువ్వు నన్నొక పచ్చి స్వార్థపరునిగా భావించవచ్చు. అలా భావించటంలో తప్పులేదు కూడా! నేనందుకు చింతించను. కారణం నిజంగా నేను స్వార్థపరుణ్ణి గనుక...'

అరుణ గుండెలు గుబగుబలాడినై, సారథి వ్రాస్తున్న దేమిటో అర్థం కాలేదు. హృదయాన్ని చిక్కబట్టుకుని గబగబా చదివేసింది.

'నేను మీకు పరిచయం చేయబడినట్లు కోనసీమవాణ్ణి నేను కాదు. నా ఉద్యోగం మాష్టరుగిరీ కాదు. మాది గుంటూరుజిల్లాలో, నీకు పేపరు వచ్చాయే, ఆ వూరు. ఉద్యోగమంటావా ప్రస్తుతం నిరుద్యోగం. కాకుతే బి. యస్సీ చదివాను కనుక ఈ వేళ కాకుంటే రేపో రోజైనా ఏదో ఉద్యోగం దొరక్కపోదు.

ఇక నా స్వార్థాన్ని గురించి. మావూరి పెద్దరైతు గారబ్బాయి పరీక్షల్లో ఇంగ్లీషు పేపరు సందేహా

స్పదంగా వ్రాశాడు. మిగిలినవి ప్యాసవుతాడనే నమ్మకం, ధైర్యం వున్నాయి. ఇంగ్లీషు పేపర్లుమీవూరు అరుణాదేవి అనే టీచరు (మీరు) కువచ్చినట్లు తెలుసుకొని తగినంత డబ్బిచ్చి పని పూర్తిచేసుకు రమ్మని నన్ను పంపారు వాళ్ళు. నేనూ అనుమానంగానే వచ్చాను. కానీ, నిన్ను చూసినక్షణంలో నాలో అవేవో ఆలోచనలు బయలుదేరాయి. నీరూపంలో ఉన్న వైచిత్రిని చూడగానే నీమనోగత భావాలెలావుంటాయో అని ఆలోచించాను. నా ఊహ నిజమయింది! నేను నీకు దగ్గరవుతుంటే నీవు మురిసిపోయావు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నా పని పూర్తి చేసుకున్నాను.

'నిన్ను మోసంచేసి నందుకు క్షమించు — అన్నట్లు!— 'రమేష్'కి కూడా నా అంతర్యం తెలీదు. అతన్ని దుయ్యబట్టకు — సారథి.'

ఉత్తరం చదవటం పూర్తిచేసిన అరుణ నిశ్చేష్టురాలైంది.

క్షణాల తర్వాత తనలో తను గొణుక్కుంది.

'అడవిలో పూసిన పిచ్చిపువ్వును నిత్యజీవితంలో ఎవరూ చూడరు, ముట్టరు, కానీ వైద్యుడు మాత్రం తన అవసరానికి ఔషధంగా వాడుకుంటాడు. అలాగైంది నాజీవితం. ఏమైనా, నన్ను మోసం చేయగలిగాడు గానీ, నా మనసుని మోసం చేయగలడా సారథి?'—

□□□




# ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు

* ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడా చాలామంచిది

* ఐటెక్స్ బిందీ
కంటికింపైన
రంగులలో
లభించును.

* ఐటెక్స్
కుంకుం పేస్టు.




అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 — మద్రాసు—17.